• ఆపదలో ఆకలి తీర్చేలా...



ఖమ్మం రూరల్ మండలంలోని పలు కాలనీల్లో బాధితులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి

• వరద బాధితులకు భరోసా ఇచ్చేలా...



సూర్యాపేట జిల్లా గోండ్రియాలలో వరద పరిస్థితులను తెలుసుకుంటున్న మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

• బాధితులకు అండగా..




ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో సహాయక చర్యల్లో పాల్గొన్న బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# చేతగానితనంతోనే ప్రాణనష్టం

- గత నెల 27నే వాతావరణ శాఖ హెచ్చరించింది
- అయినా కుంభకర్ణ నిద్రలో కాంగ్రెస్ ప్రభుత్వం
- ముందస్తు, సహాయక చర్యల్లో ఘోరంగా విఫలం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- తెలంగాణ సీఎం ఎన్ని హెలికాప్టర్లు, పడవలు తెప్పించారంటే.. 'బిగ్ జీరో' అంటూ ఎద్దేవా







హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ చేతగానితనం వల్లే వర్షాలు, వరదలతో ప్రాణనష్టం సంభవించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేవలం రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించటం అన్యాయమని మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, ఇండ్లు కోల్పోయిన, దెబ్బతిన్నవారికి రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు సాయం అందిస్తామని గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి వాగ్దానం చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆగస్టు 27నే భారీ వర్ష సూచన చేసిందని, అలెర్ట్‌గా ఉండాలని చెప్పిందని, కానీ, రాష్ట్రంలో కుంభకర్ణ నిద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయిందని దెప్పిపొడిచారు. రేవంత్ సర్కార్ నేరపూరిత నిర్లక్ష్యం ఖరీదు ఓ యువ శాస్త్రవేత్తతో పాటు సుమారు ఇరవై మంది ప్రాణాలు అని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఓ మంత్రి హెలికాప్టర్లు దొరకలేదంటడు.. మరో మంత్రి, ఈ రాష్ట్రానికి సీఎం లేనట్టు పక్క రాష్ట్ర సీఎంకు ఫోన్ చేస్తడు, ఇంకో మంత్రి ఫొటో ఫోజులకే పరిమితమవుతడు' అంటూ దుయ్యబట్టారు. 'నష్టం జరిగాక పూల డెకరేషన్ స్టేజీ మీద కూర్చొని వరదల మీద సమీక్ష చేసే చీఫ్ మినిస్టర్.. ఉల్టాచోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్టు ప్రతిపక్షం ఏం చేస్తున్నదని ప్రశ్నిస్తున్నాడు' అంటూ ఎద్దేవా చేశారు.

**బిగ్ జీరో**

'పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరు హెలికాప్టర్లు, 150 పడవలు తెప్పిస్తే మరి తెలంగాణ ప్రభుత్వం ఎన్ని హెలికాప్టర్లు, పడవలు తెప్పించిందో చెప్పాలి' అని ఎక్స్‌లో కేటీఆర్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. దీనికి సమాధానం 'బిగ్ జీరో' అంటూ ఎద్దేవాచేశారు.

**రాహుల్ గాంధీ ట్వీట్‌పై కేటీఆర్ చురకలు**

'భారీ వర్షాలు, వరదల కారణంగా తెలంగాణలో ఏర్పడిన పరిస్థితులు ఆవేదనకు గురిచేశాయి.. ప్రజలకు ఇబ్బంది లేకుండా తెలంగాణ ప్రభుత్వం అవిశ్రాంతంగా చర్యలు చేపట్టింది' అంటూ రాహుల్‌గాంధీ చేసిన ట్వీట్‌పై కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. 'తెలంగాణలో నిజంగా ప్రభుత్వం తరఫున సహాయక కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తున్నారో? లేదో? తెలుసుకుంటే ఇక్కడ మీ ప్రభుత్వ నిర్వాకం తెలుస్తుంది' అంటూ రాహుల్‌కు చురకలంటించారు. 'వరదల్లో చిక్కుకున్న ప్రజలను దేవుడే కాపాడాలని ప్రభుత్వ పెద్దలే మాట్లాడుతుంటే ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఏం ప్రయోజనం?' అంటూ నిలదీశారు. ఓ జేసీబీ డ్రైవర్ సోదరుడు తన ప్రాణాలకు తెగించి తొమ్మిది మంది ప్రాణాలు కాపాడారని చెప్పారు. 'వరదలతో సతమతమవుతున్న ప్రజలు సాయం కోరితే లాఠీచార్జీలతో హింసిస్తారా? సిగ్గు తెచ్చుకోండి' అంటూ రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు.

**అండగా ఉన్నవారికి అభినందనలు**

విపత్కర సమయంలో ప్రజలకు బీఆర్ఎస్ కార్యకర్తలు మేమున్నామంటూ భరోసా కల్పించారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు కష్టమొచ్చిందంటే ముందుండేది బీఆర్ఎస్సేనని మరోసారి రుజువు చేశారని పార్టీ శ్రేణులను అభినందించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకోవడంలో ఖమ్మం జిల్లా నాయకులు మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, వరంగల్ బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందనీయమని పేర్కొన్నారు.

**ఎస్‌ఎన్‌డీపీ వల్లే హైదరాబాద్‌కు తప్పిన ముంపు**

విజన్ ఉంటే విపత్తులను కూడా సమర్థంగా ఎదుర్కోవచ్చని బీఆర్ఎస్ హయాంలో అమలుచేసిన వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఎన్‌డీపీ) అక్షరాలా నిరూపించిందని కేటీఆర్ స్పష్టంచేశారు. హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలను ముంపు నుంచి కాపాడటంలో ఎస్‌ఎన్‌డీపీ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఎస్‌ఎన్‌డీపీ పనుల వల్లే వరద బాధ పోయిందని ప్రజలు చెప్పడం సంతృప్తినిస్తున్నదని పేర్కొన్నారు.

**కేవలం 5రోజుల్లో 800 డెంగ్యూ కేసులు**

డెంగ్యూతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 6000 డెంగ్యూ కేసులు నమోదైతే దాచిపెట్టిందని విమర్శించారు. 5 రోజుల్లోనే 800 డెంగ్యూ కేసులు నమోదైనట్టు ఫ్యామిలీ అండ్ వెల్ఫేర్ డైరెక్టర్ నిర్ధారించిందని గుర్తుచేశారు.

**కరెంటు బకాయిలు కట్టాలని ఒత్తిడి**

గ్యారెంటీలను నమ్మి కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలను వంచించడాన్ని రేవంత్ సర్కార్ మొదలు పెట్టిందని కేటీఆర్ విమర్శించారు. గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్తు అంటూ ఊదరగొట్టి, ఇప్పుడు ఐదు నెలల బకాయిలు కట్టాలని ప్రజలపై ఒత్తిడి తెస్తున్నదని మండిపడ్డారు. మళ్లీ అప్లికేషన్ పెట్టుకోవాలని చెప్పి ఐదు నెలల బకాయిలు చెల్లించాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

**నేతన్నలను కాపాడండి**

సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారుతున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. సర్కార్ నిర్లక్ష్యం కార్మికుల ఉసురు తీస్తున్నదని విమర్శించారు. 'నేతన్నలకు భరోసా ఇచ్చే బతుకమ్మ చీరెల ఆర్డర్లను నిలిపివేసి వాళ్ల పొట్టకొట్టడం న్యాయమేనా? ఆదుకోవాల్సిన ప్రభుత్వమే ఉపాధి లేకుండా చేయడమేమిటి?' అని ప్రశ్నించారు. నేతన్నలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

## సుభాన్‌ఖాన్.. నీ సాహసానికి సెల్యూట్: కేటీఆర్

'పోతే ఒక్కడినే.. వస్తే పది మంది అని ప్రమాదానికి ఎదురెళ్లిన నీకు సలాం..' అంటూ ఖమ్మం జిల్లాలో తొమ్మిది మందిని కాపాడిన జేసీబీ డ్రైవర్ సుభాన్‌ఖాన్ సాహసాన్ని ఉద్దేశించి కేటీఆర్ కొనియాడారు. ఆయనకు ఫోన్‌చేసి అభినందించినట్టు సోమవారం ఎక్స్ వేదికగా తెలిపారు. సుభాన్‌ఖాన్‌ను తాను త్వరలో కలుస్తానని వెల్లడించారు. 'వారిని రక్షించేందుకు హెలికాప్టర్‌ను ఎలా తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తూ చేష్టలుడిగితే, ధైర్యంగా ముందుకెళ్లి వారిని రక్షించిన సుభాన్‌ఖాన్ రియల్ హీరో.. నీ సాహసానికి సెల్యూట్' అంటూ అభినందించారు.

## రక్షిత మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన 16 ఏళ్ల రక్షిత అనే విద్యార్థిని నిజామాబాద్‌లోని పాలిటెక్నిక్ కాలేజీ హాస్టల్‌లో అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటనపై కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. హాస్టల్‌లో చేరిన రెండో రోజే రక్షిత బాత్‌రూమ్‌లో శవమై కనిపించిందని, దుపట్టాతో ఉరి వేసుకున్నదని చెప్తున్నా, అంతకుముందు రాత్రి 8 గంటలకు తల్లితండ్రులతో ఫోన్‌లో మాట్లాడి అంతా బాగానే ఉన్నదని చెప్పిన అమ్మాయి తెల్లారేసరికి చనిపోవటం అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. ఆమె మృతదేహాన్ని తల్లితండ్రులు వచ్చే వరకు ఉంచకుండా హడావుడిగా హాస్పిటల్‌కు తరలించే ప్రయత్నం చేయటం, సంఘటన జరిగిన రోజు సీసీ టీవీ పుటేజ్ లేదని చెబుతుండటం అనుమానాలను మరింత బలపరుస్తున్నదని చెప్పారు. హడావుడిగా మృతదేహాన్ని తరలించటం, సీసీ పుటేజ్ మాయం చేయటంపై ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగేదాకా పోరాడుతామని చెప్పారు.



ఖమ్మంలో వరదలో చిక్కుకున్న వారిని కాపాడిన నర్సింహారావును సత్కరిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు

# ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే

- 'మున్నేరు'పై ముందు జాగ్రత్త లేకనే అపార నష్టం
- ముగ్గురున్నా ముంపు బాధితులను ఆదుకోలేదు
- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు ఇవ్వాలి
- మీడియాతో మాజీ మంత్రి అజయ్, ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి కూడా ముంపు బాధితులను ఆదుకోలేకపోయారని, వారంతా అసమర్థ మంత్రులేనని దుయ్యబట్టారు. మున్నేరువరదలపై ప్రభుత్వానికి ముందు జాగ్రత్త లేకపోవడం వల్లే ఇంతటి నష్టం వాటిల్లిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పుట్టెడు దుఃఖంతో ఉన్న ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం వారు పర్యటించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ..మున్నేరు వరదపై ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. వరదల్లో మృతిచెందిన వ్యక్తుల కుటుంబానికి ఒక్కొక్కరికీ 25 లక్షల చొప్పున పరిహారం అందించాలని, కుటుంబానికీ 2 లక్షల తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎంపీ వద్దిరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముంపునకు గురైన ప్రాంతాల్లో ఇళ్లన్నీ బురదతో నిండి ఉన్నాయని, పాములు సంచరిస్తున్నాయని తెలిపారు. సర్వం కోల్పోయి రోడ్డున పడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఖమ్మంలో మున్నేరు వరద బాధితులను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

# ఖమ్మంను నట్టేట ముంచారు

**మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీని నమ్మిన ఖమ్మం ప్రజలను నట్టేట ముంచారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. వరద సహాయక చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సోమవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. వర్షాలతో రాష్ట్రం అల్లకల్లోలమవుతుంటే సీఎం ఏం చేస్తున్నాడంటూ ప్రశ్నించారు. వరదల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు బడే భాయ్‌ని హెలికాప్టర్ పంపించమని అడిగే తీరిక సీఎంకు లేదా అంటూ నిలదీశారు. ప్రజలు వరదల్లో చిక్కుకున్న తర్వాత రోజు తీరిగ్గా సీఎం బయటకు వచ్చాడని, ఖమ్మం వరదల్లో చిక్కుకున్న తొమ్మిది మందికి రాష్ట్ర ప్రభుత్వ సాయం లభించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

## హెలికాప్టర్ తెప్పించలేని అసమర్థ సీఎం

- ప్రజలు కొట్టుకుపోతుంటే.. ప్రభుత్వం మొద్దు నిద్ర
- ఆదివారమంతా సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నట్టు?
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) వరద సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరదల్లో కొట్టుకుపోతున్న వారిని కాపాడటానికి కనీసం హెలికాప్టర్ తెప్పించలేని అసమర్థులు మన ముఖ్యమంత్రి, మంత్రులు అంటూ విరుచుకుపడ్డారు. రెవెన్యూ శాఖ మంత్రిగా ఉండి ఒక హెలికాప్టర్ తీసుకరాలేని మంత్రి పొంగులేటి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావుతో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వరదల్లో చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియాగా రూ.25 లక్షలు చెల్లించాలని గతంలో డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు అమలు చేయాలని సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో 20 జిల్లాల్లో వర్షం ప్రభావం ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సగటున 45 సెంటీమీటర్లకు పైగా వర్షం పడుతుంటే.. ఆదివారం రోజంతా ఎక్కడా కనిపించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని, అంత రహస్య సమావేశాలు, చర్చలు ఏమిటో ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రపోయిందని, గంటల తరబడి బాధితులు సహాయం కోసం చూశారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని మండిపడ్డారు. వరదలపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యల్లో ఒక్క రాజకీయ పదం కనిపించిందా? కోదాడలో ఎవరి హయాంలో కబ్జాలు జరిగాయో ఉత్తమ్‌తో చర్చకు సిద్ధమని చెప్పారు.

**ఆ మంత్రికి ఏపీ సీఎం దొరికాడు కానీ తెలంగాణ సీఎం దొరకలేదా..?**

ప్రజలే రెస్క్యూ ఆపరేషన్ చేసుకొని ప్రాణాలు కాపాడుకున్నారని, హెలికాప్టర్ కోసం ప్రయత్నించినా రాలేదని చెప్తున్న మంత్రి తక్షణం రాజీనామా చేయాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. హెలికాప్టర్ రాకుంటే ముఖ్యమంత్రి ప్రధానమంత్రితో మాట్లాడకుండా నిన్న ఏం చేశారని నిలదీశారు. సైనిక విమానం 45 నిమిషాల్లో ఖమ్మంకు చేరుకునేదని, ప్రాణాలను కాపాడేదని అభిప్రాయపడ్డారు. ఒక మంత్రి హెలికాప్టర్ కోసం ఏపీ సీఎంతో మాట్లాడాను అని చెప్పున్నారని, ఆయన తెలంగాణ సీఎంతో ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు. ఆ మంత్రికి ఏపీ సీఎం దొరికాడు తప్ప తెలంగాణ సీఎం దొరకలేదా అంటూ నిలదీశారు. సీఎంతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, మాట్లాడితే తెలంగాణకు హెలికాప్టర్ కావాలని ఎందుకు అడగలేదని సందేహం వ్యక్తంచేశారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి ఏం చేస్తున్నారని ప్రజలు అడుగుతున్నారని పేర్కొన్నారు. భువనగిరి, కోదాడ, నల్లగొండ, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి హెలికాప్టర్ దొరుకుతుందని, కానీ ప్రజలను రక్షించేందుకు దొరకదా అంటూ ఈ ప్రభుత్వానికి పరిపాలించే నైతిక హక్కు లేదని, వర్షాలతో సంభవించిన మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.



సోమవారం హైదరాబాద్‌లోని ఫీవర్ హాస్పిటల్ ఓపీ బ్లాక్ వద్ద బారులుదీరిన రోగులు


# పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

- ఇప్పటికే సీజనల్ వ్యాధుల విజృంభణ
- రాష్ట్రంలో వేలాదిగా డెంగీ కేసుల నమోదు
- సమీక్షలతో మంత్రుల సమయం వృథా
- దవాఖానల్లో వేధిస్తున్న మందుల కొరత



కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న ఇన్‌వార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటికే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పారిశుద్ధ్య లోపం, వైద్యారోగ్యశాఖ వైఫల్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది డెంగీ కేసులు నమోదవుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా సైతం విజృంభిస్తున్నాయి. ఇలాంటి సమయంలో వర్షాలు, వరదలతో వ్యాధుల ముప్పు పొంచి ఉన్నదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాలతో నీళ్లు నిలిచి ఇప్పటికే దోమల సంఖ్య పెరుగుతున్నదని, వరద తగ్గిన తర్వాత ప్రభావిత ప్రాంతాల్లో కలరాతోపాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని గుర్తు చేస్తున్నారు. వర్ష, వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సహాయక చర్యలపై నిరంతరం పర్యవేక్షించాల్సిన సమయంలో వైద్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులు చట్టాలపై సమీక్షలు నిర్వహించడమే ఇందుకు ఉదాహరణగా చెప్తున్నారు. ప్రస్తుత పరిస్థితులతో సంబంధం లేని అంశంపై గంటలపాటు సమీక్షిస్తూ, సమయం వృథా చేయడంపై మండిపడుతున్నారు. ఇప్పుడే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే మరిన్ని వ్యాధులు విజృంభిస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే దవాఖానల్లో మందుల కొరత నెలకొన్నదని గగ్గోలు పెడుతున్నారని, తగిన విధంగా స్పందించాలని కోరుతున్నారు.



మంచిర్యాల ఏసీహెచ్‌లో రోగులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

# పంటలకు చీడపీడల బెడద

**నివారణకు చేపట్టాల్సిన చర్యలు ఇవీ**

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో వరి, పత్తి తదితర పంటలకు చీడపీడల బెడద పెరగవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని సూచించారు.

- వరి పంటకు బ్యాక్టీరియా, ఎండాకు తెగులు వ్యాప్తిని నివారించేందుకు ఎకరానికి 44 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్, 60 గ్రాముల స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. పూత దశలో ఉన్న వరి పంటకు కాపర్ శిలీంధ్రనాశినులను పిచికారీ చేయరాదు.
- పత్తిచేలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఎండు తెగులు వ్యాప్తి నివారణకు లీటర్ నీటికి గ్రాము చొప్పున కార్బండాజిమ్‌ను మొక్కల మొదళ్ల వద్ద పోయాలి. ఆకుమచ్చ, ఆల్బేనేరియా ఆకు మాడు, కాండం మాడు తెగుళ్ల నియంత్రణ కోసం ఎకరానికి 500 గ్రాముల కార్బండాజిమ్, మాంకోజెబ్ మిశ్రమాన్ని లేదా 80 గ్రాముల ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్, టెబుకొనజోల్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**నెం.NW/148/WIII/Tender Notice/ 2024-25, తేది: 02-09-2024**

PUB/0672

టెండర్ వివరాలు www.ireps.gov.inలో ఇంతకుముందే అప్‌లోడ్ చేయబడినవి.

1. **టెండర్ నెం.**T202425-1-049, **అథారిటీ:** కో-ఆర్డ్ **పని వివరణ:** SW 1: బస్మాత్ (BMF) గూడ్స్ షెడ్ వద్ద మిగిలిన వార్ఫ్ స్లీపర్ మ్యాటింగ్ ఏర్పాటుచేయుట, లైటింగ్ అరేంజిమెంట్స్, హమాల్ షెడ్, సిసిటివి మొదలగునవి ఏర్పాటుచేయుట, SW 2: బస్మాత్ వద్ద VDF కాంక్రీట్ ఉపయోగించి ప్లాట్‌ఫాం సర్ఫేస్‌కు మెరుగుదల. **టెండర్ విలువ:** రూ.106892127.97/-, **బయానా:** రూ.684500.00, **పూర్తి చేయు కాలం:** పన్నెండు నెలలు, **టెండర్ ఫారం ధర:** రూ.0/-.

**టెండర్ నెం.** T-202425-1-049

**ఇదే తరహా పనులు (50 లక్షల కంటే ఎక్కువ వ్యయం కొరకు):** ఏదేని సివిల్ ఇంజినీరింగ్ పనులు (ట్రాక్/జోనల్ పనులు మినహా)

పైన తెలిపిన టెండర్ 24-09-2024న 15.00 గం.కు ముగించబడును.

A1123 Sr.DEN/Co-ord/నాందేడ్

**తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.**



FORM NO.14 [See Regulation 33(2)]

**OFFICE OF THE RECOVERY OFFICER - I/II**
**DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1)**
**3rd Floor, Triveni Complex, Abids, Hyderabad- 500 001**

**DEMAND NOTICE**

**NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961**

RC/973/2018 21-08-2024

**STATE BANK OF INDIA**
**Versus**
**SMT. LEENA SURESH SINGH**

To

**(CD-1) Smt. Leena Suresh Singh,** W/o. Suresh Gopal Singh, R/o. H.No.5-1-1/6A, Behind Sri Teja Jr. College, Shantinagar, Sangareddy, Medak.

**(CD 2) Shri Suresh Gopal Singh**, R/o. H.No.5-1 -1/6A, Behind Sri Teja Jr. College, Shantinagar, Sangareddy, Medak Dist., Telangana -502001.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, **Debts Recovery Tribunal, Hyderabad (DRT 1)** in **OA/1224/2016** an amount of **Rs. 29,99,564.00 (Rupees Twenty Nine Lakhs Ninety Nine Thousands Five Hundred Sixty Four Only )** along with pendentellite and future interest @ **11.80 %** w.e.f. the date of Recovery Certificate // till realization and costs of **Rs. 0 ( Only )** has become due against you (Jointly and severally/ Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act,1993 and Rules there under.

3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.

4. You are hereby ordered to appear before the undersigned on **09-10-2024 at 10.30 a.m.** for further proceedings.

5. In addition to the sum aforesaid, you will also be liable to pay: (a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate/execution proceedings, (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: **21-08-2024.**

**Sd/- Recovery Officer**
**DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1)**